క్లుప్తంగా

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

ఎటపాక: మండలంలోని కృష్ణవరం గ్రామంలో ఓ నిరుపేద కుటుంబానికి గ్రామ యువత సోమవారం ఆర్థిక సాయం అందించారు. కురం నారాయణ ఇటీవల అకాల మరణం చెందడంతో సర్పంచ్ కృష్ణ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి సాయం చేశారు. ఈ కార్యక్రమంలో కాక రాజు, చిచ్చడి రామారావు, సున్నం శ్రీను, పద్దం వెంకటేశ్వర్లు, చిచ్చడి నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి జలపాతం వద్ద టీవీ కళాకారుల సందడి


కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న టీవీ కళాకారులు

జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతం వద్ద సోమవారం జబర్దస్త్ టీమ్ నటులు సందడి చేశారు. పాడేరు మోదకొండమ్మతల్లి జాతర మహోత్సవాలకు వచ్చిన కళాకారులు కొత్తపల్లి జలపాతం సందర్శనకు వచ్చారు. ఇక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

అడ్డతీగల స్టాక్ పాయింట్‌కు పాఠ్య పుస్తకాలు


పుస్తకాలను సరిచూస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు, సిబ్బంది

అడ్డతీగల: రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్య, నోటు పుస్తకాలు అడ్డతీగల స్టాక్ పాయింట్‌కు చేరుకున్నట్లు ఎంఈవో పి.శ్రీనివాసరావు తెలిపారు. మండల వ్యాప్తంగా 5,375 మంది విద్యార్థులకు అవసరమైన 27,038 నోటు పుస్తకాలు వచ్చాయన్నారు. పాఠ్య పుస్తకాలు తొలి దశ 70 శాతం వచ్చాయని, 30 శాతం రావాల్సి ఉందన్నారు. యూనిఫారం, బెల్ట్‌లు, షూలు, డిక్షనరీలు, బ్యాగ్స్ త్వరలో రానున్నాయని చెప్పారు.

తాటి చెట్టు పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజవొమ్మంగి: మండలంలోని చికిలింత పంచాయతీ దుర్గానగర్ శివారులో సోమవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు, భారీ వర్షానికి ఓ తాటి చెట్టు 33/11 కేవీ విద్యుత్ లైన్‌పై పడిపోయింది. సిమెంటు స్తంభాలు విరిగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్ పునరుద్ధరించామని విద్యుత్ ఏఈ కె.అబ్బాయిదొర తెలిపారు.

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వీఆర్‌పురం: మండలంలోని పలు చోట్ల శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి. శబరి గోదావరి సంగమం తీరాన వడ్డుగూడెం గ్రామం వద్ద కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు పురుషోత్తమ ఆచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మండలంలోని నడివీధి, దిగువీధి, పాత రాజుపేట, రాజుపేట, తదితర గ్రామాల్లో స్వామివారి కల్యాణాలు జరిపారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఆయ గ్రామాల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణాలు పూర్తి చేయాలి


నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాన్ని చూపుతున్న ఎన్‌హెచ్‌ఆర్‌పీఎఫ్ ప్రతినిధులు

అడ్డతీగల: అడ్డతీగల మండలంలోని గొండోలు, సరంపేట గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవన నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిటీ అడ్డతీగల మండల అధ్యక్షులు ఎస్.వి.ఎస్.రమణ, ఎస్.కె.నవాజ్ అన్నారు. ఆరేళ్లుగా భవన నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయన్నారు. అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు విషయాన్ని తెలియజేసినా పట్టించుకున్నవారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. భవనాలు లేక ఆ గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన భవన నిర్మాణాలు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గుక్కెడు నీటి కోసం అష్టకష్టాలు

- గిరి గ్రామాల్లో దాహం.. దాహం
- అడుగంటిన భూగర్భ జలాలు
- ఊట నీరు, పొలాల్లో బోర్లే దిక్కు


పాముురాయి గ్రామంలో లోయలో ఉన్న ఊట గెడ్డ నుంచి మంచినీరు సేకరిస్తున్న గిరిజన మహిళలు


పనసపుట్టు గ్రామంలో పొలాల నీరు సేకరిస్తున్న మహిళలు


పాతకోట చింతలవీధిలో ఊట గెడ్డ నీరు సేకరిస్తున్న మహిళలు

హుకుంపేట: మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో గిరిజనులు మంచినీటి సమస్యతో సతమతమవుతున్నారు. వేసవి కాలం ఆపై ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో గ్రామాల్లో బోర్లు, మంచినీరు పథకాలు ఇంకుపోయాయి. మరోవైపు పలు మంచినీటి పథకాలు మరమ్మతులకు గురై మూలకు చేరాయి. మండల కేంద్రం హుకుంపేటతో పాటు దిగుడుపుట్టు, తీగలవలస పంచాయతీ పాముురాయి, పంతల చింత గ్రామం, పాతకోట పంచాయతీ చింతలవీధి, పనసపుట్టు, పాలేం, మంగళిమామిడి గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. పాముురాయి గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద పంచాయతీ నిధులతో రెండు బోర్లు వేసినప్పటికీ భూగర్భ జలాలు అడుగంటడంతో ఫలితం లేకుండాపోయింది. దీంతో గుక్కెడు నీటి కోసం గ్రామ సమీపంలో లోయలో ఉన్న ఊట గెడ్డకు వెళ్లి తీసుకుంటున్నట్టు పరిస్థితులు నెలకొన్నాయి. దిగుడుపుట్టు గ్రామంలో మంచినీటి పథకం పూర్తిగా మరమ్మతులకు గురైంది. పాతకోట పంచాయతీ పనసపుట్టు, చింతలవీధి, పాలేం గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా వేసిన తాగునీటి పథకాలు సరిగ్గా పనిచేయలేదు. ఆయా గ్రామాల సమీప పొలాల్లో ఉన్న కలుషితమైన బురదనీరు, ఊట గెడ్డలో నీరే ప్రజలకు దిక్కవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.


దిగుడుపుట్టులో పని చేయని కుళాయి

శాశ్వత పరిష్కారం చూపాలి



వేసవి కాలం వస్తే మా గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువ అవుతుంది. గ్రామంలో రెండు మోటార్ బోర్లు ఉన్నా ఎండకు భూగర్భ జలాలు అడుగంటడంతో ఫలితం లేకుండాపోయింది. మహిళలు లోయలోకి వెళ్లి ఊట గెడ్డ నీరు తీసుకొస్తున్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– పాంగి శ్రీనివాసరావు, పాముురాయి గ్రామం, హుకుంపేట మండలం

మంచినీటి పథకాలు అటకెక్కాయి..



మా గ్రామంలో మంచినీటి పథకాలు పూర్తిగా అటకెక్కాయి. కనీసం తాగడానికి నీరు దొరక్క ఇబ్బందులు పడుతున్నాం. సంబంధిత అధికారులకు చెప్పినా ఇప్పటి వరకు పరిష్కరించలేదు.

– గద్దంగి సూరిబాబు, దిగుడుపుట్టు గ్రామం

తాగునీటి పథకాల నిర్మాణంలో నాణ్యత లోపం



గ్రామాల్లో నిర్మించిన జలజీవన్ మిషన్ పథకాలల్లో పూర్తిగా నాణ్యత లోపించింది. స్థానిక నాయకులకు తెలియకుండా టెండర్ల ద్వారా ఇష్టం వచ్చినట్లుగా నిర్మించి బిల్లులు చేసుకున్నారు. వారం తరువాత నుంచి తాగునీటి పథకాలు మరమ్మతులకు గురయ్యే పరిస్థితులు వచ్చాయి. దీంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు నెలకొన్నాయి.

– సుడిపల్లి కొండలరావు, వైస్ ఎంపీపీ, హుకుంపేట మండలం

శ్రీపాకలపాటి గురుదేవుల ఆలయంలో పౌర్ణమి వేడుకలు


హోమం నిర్వహిస్తున్న సంఘం అధ్యక్షుడు మత్స్యరాజు

జి.మాడుగుల: స్థానిక శ్రీపాకలపాటి గురుదేవుల ఆలయంలో సోమవారం పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆలయంలో సంఘం అధ్యక్షుడు మత్స్యరాస మత్స్యరాజు భక్తిశ్రద్ధలతో పూజలు, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మత్స్యరాస విజయకుమారి, పాడేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మత్స్యరాస గాయత్రి, భక్తులు పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా ఆశీలు వసూలు


వేలం పాట నిర్వహిస్తున్న ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి

ముంచంగిపుట్టు: నిబంధనలకు అనుగుణంగా వారపు సంతలో ఆశీలు వసూలు చేయాలని ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ముంచంగిపుట్టు వారపు సంత ఆశీలు వేలం పాటను సోమవారం నిర్వహించారు. రూ.1,53,500కు పాంగి జగ్గారావు అనే వ్యక్తి ఆశీలు వసూల వేలం పాటను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి వరకు వారపు సంతలో ఆశీలు వసూలు చేసుకోవచ్చునని, సంతలో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. మూడు వాయిదాల లోపు పాట పాడిన సొమ్మును చెల్లించాలని ఆయన సూచించారు.

కడుతులలో నీటి సమస్య పరిష్కరించాలి


గ్రీవెన్స్‌లో ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న కడుతుల గ్రామ గిరిజనులు

ముంచంగిపుట్టు: పనసపుట్టు పంచాయతీ కడుతుల గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామ గిరిజనులు సోమవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎంపీడీవో సూర్యనారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు. కడుతులలో గ్రావిటీ నీటి పథకం అడుగంటి, నీటి సరఫరా నిలిచిపోయిందని, జేజేఎం ద్వారా జరుగుతున్న నీటి పనులు మధ్యలోనే నిలిచిపోయాయని, నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నామని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన ఎంపీడీవో మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నర్సమ్మ, సీడీపీవో వరహాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం


జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న సీఐ వెంకటరమణ, నాయకులు

కొయ్యూరు: జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. మొత్తం 42 జట్లు ఈ టోర్నీలో తలపడుతున్నాయి. ఈ సందర్భంగా ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, సీఐ వెంకటరమణ మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలు ఇక్కడ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. చింతపల్లి, కొయ్యూరు ఏవైసీ టీచర్ల జట్ల మధ్య జరిగిన తొలి రోజు పోటీలో చింతపల్లి జట్టు విజయం సాధించింది. చింతపల్లి టీంకు చెందిన వినోద్ 50 పరుగులు చేయడంతో పాటు రెండు వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు ఎంపికయ్యాడు. ఈ కార్యక్రమంలో మర్రివాడ ఎంపీటీసీ పి.గంగాభవాని, చీడిపాలెం, కొయ్యూరు సర్పంచ్‌లు సోమన్నదొర, బాలరాజు, అల్లూరి యూత్ సభ్యులు అంబటి నూకరాజు, అనిశెట్టి చిరంజీవి, వేణు, లవకుశ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వీర జవాన్ మురళికి ఘన నివాళి


వీర జవాన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

డుంబ్రిగుడ(అరకులోయ టౌన్): కాంగ్రెస్ పార్టీ అరకులోయ నియోజకవర్గ కార్యాయలంలో ఆదివాసీ నిరుద్యోగ సంఘం ఆధ్వర్యంలో వీర జవాన్ మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ టి.సోమేశ్వరరావు మాట్లాడుతూ వీరుడు, ధీరుడు గిరిజన ముద్దుబిడ్డ చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణాలు అర్పించాడని, ఎప్పటికీ గిరిజనుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాడని కొనియాడారు.

అరకులోయ రూరల్: జవాన్ మురళీ నాయక్ దేశానికి చేసిన సేవా ఎప్పటికి మర్చిపోలేమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ తెలిపారు. సోమవారం పాడేరు కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాల సాగు మేలు


నవధాన్యాల సాగుపై ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సాధికార సంస్థ సభ్యులు, రైతులు

జి.మాడుగుల: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నవధాన్యాల సాగుపై రైతు సాధికార సంస్థ సిబ్బంది విస్తృత ప్రచారం చేశారు. మండలంలో లువ్వాసింగి పంచాయతీలోని పలు గ్రామాల్లో గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం పద్ధతులు తెలియజేశారు. ప్రస్తుతం రైతులు విషపూరిత రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల అనారోగ్యం బారిన పడుతున్నారని సంస్థ యూనిట్ ఇన్‌చార్జిలు మేడా ప్రసాద్, జె.కృష్ణారావు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఘన, ద్రవ, జీవామృతాలు, కాషాయాలు తయారు చేసుకొని పంటలు పండించుకోవాలని సూచించారు. ఈ నెలలో నవధాన్యాల సాగు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. రైతు వద్ద ఉన్న విత్తనాలతో పాటు వ్యవసాయ శాఖ ఇచ్చే పచ్చిరొట్ట ఎరువులు జనుము, జీలుగు, పిల్లిపెసర కలుపుకొని ఎకరానికి కనీసం 12 కిలోల చొప్పున 30 రకాలు విత్తనాలు మొదటి దుక్కులో చల్లుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ యూనిట్ ఐసీఆర్‌పీ బొంజుబాబు, కొండబాబు, సురేష్, ఢిల్లీబాబు, లక్ష్మయ్య, సత్యవతి, ఇందుమతి, కొండమ్మ, గ్రామపెద్దలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఒనుగుపల్లిలో తాగునీటి ఎద్దడి


నిరుపయోగంగా మారిన తాగునీటి పథకాన్ని చూపిస్తున్న గ్రామస్తులు

పాడేరు రూరల్: ఒనుగుపల్లి పంచాయతీ వి.కరకపుట్టులో తాగునీటి సమస్య వేధిస్తోంది. గ్రామంలో 22 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మైలు దూరంలో ఉన్న ఊట గెడ్డలే తాగునీటికి ఆధారమవుతున్నాయి. గ్రామంలో ఉన్న గ్రావిటీ పథకం నిరుపయోగంగా మారింది. గతంలో ఏర్పాటు చేసిన బోరుకు మోటార్ వేయకుండా వదిలేశారు. నూతనంగా నిర్మించిన తాగునీటి పథకం పనులను అస్తవ్యస్తంగా చేపట్టి వదిలేశారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు ఐటీడీఏ స్పందనలో ఫిర్యాదు చేసినా అధికారులు కనీసం పట్టించుకోలేదని గ్రామానికి చెందిన బొంజిబాబు, డి.బొజ్జన్న సోమవారం ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న తాగునీటి పథకాన్ని మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

మోదమ్మకు పట్టు వస్త్రాలు


మోదకొండమ్మ సన్నిధిలో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మూర్తి దంపతులతో అరకు ఎంపీ తనూజరాణి,చెట్టి వినయ్, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు


మోదమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర భక్తుల కల్పవల్లి పాడేరు మోదకొండమ్మతల్లికి పట్టణంలోని విశ్వబ్రాహ్మణ సంఘం పట్టు వస్త్రాలను సమర్పించింది. విశ్వబ్రాహ్మణులంతా పట్టు వస్త్రాలను పాడేరు పురవీధుల్లో ఊరేగించారు.అనంతరం మోదమ్మ ఆలయంలో ఉత్సవ కమిటీ,ఆలయ కమిటీల అధ్యక్షుడు,పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు విశ్వబ్రాహ్మణసంఘం ప్రతినిధులు వెంకటరమణ,నానాజీ దంపతులు పట్టు వస్త్రాలను అందజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మోదకొండమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా పాడేరు ఐటీడీఏ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం రాత్రి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలకు చెందిన గిరిజన కళాకారులు, యువతీ, యువకులంతా పోటాపోటీగా జానపదం, గిరిజన నృత్యాలతో సందడి చేశారు. కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.


ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు అమ్మవారి పట్టు వస్త్రాలు అందిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు వెంకటరమణ, నానాజీ దంపతులు


మోదమ్మను దర్శించుకుంటున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, కోటిబాబునాయుడు


గిరిజనుల సంప్రదాయ నృత్య ప్రదర్శన


కళాకారిణుల నాట్య ప్రదర్శన

డిజిటల్ నైపుణ్యంపై అవగాహన అవసరం


డిజిటల్ శిక్షణలో పాల్గొన్న స్వయం సహాయక సంఘ సభ్యులు

చింతపల్లి: స్వయం సహాయక సంఘ సభ్యులు డిజిటల్ నైపుణ్యంపై అవగాహన కలిగి ఉండాలని వాసవ్య మహిళా మండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమిర్ విజయకుమార్ అన్నారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో స్వయం సహాయక సంఘం సభ్యులకు డిజిటల్ నైపుణ్యం, సురక్షిత ఆరోగ్యం, వ్యవస్థాపకత వంటి అంశాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే నేటి సమాజంలో డిజిటల్‌పై పట్టు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ మూర్తి, సునీత, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు, 20 సంఘాల మహిళలు పాల్గొన్నారు.

గొబ్బరపడలో ప్రత్యేక వైద్య శిబిరం


గొబ్బరపడలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారి శ్యాంప్రసాద్, సిబ్బంది


కాలినడకన కొండ ప్రాంతంలో గొబ్బరపడ వెళ్తున్న లబ్బూరు వైద్యాధికారి శ్యాంప్రసాద్, సిబ్బంది

ముంచంగిపుట్టు: రంగబయలు పంచాయతీ గొబ్బరపడ గ్రామంలో లబ్బూరు వైద్యాధికారి శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 30 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నాటు వైద్యం జోలికి పోవద్దని, వైద్య సిబ్బంది ఇచ్చే మందులు వాడాలని ఆయన సూచించారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఏడుగురిని మెరుగైన వైద్య సేవలు నిమిత్తం ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. గొబ్బరపడ గ్రామానికి వైద్యాధికారి, వైద్య సిబ్బంది ఏడు కిలోమీటర్ల కాలినడకన కొండలు, గుట్టలు ఎక్కి గ్రామానికి వెళ్లి వైద్య సేవలు అందించడం విశేషం. ఈ కార్యక్రమంలో లబ్బూరు పీహెచ్‌సీ హెచ్‌వీ భాగ్యలక్ష్మి, ఏఎన్‌ఎం గౌరిమణి, హెల్త్ అసిస్టెంట్ రాజా, తదితరులు పాల్గొన్నారు.

ఊరటనిచ్చిన వర్షం


జి.మాడుగులలో కురుస్తున్న వర్షం

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. గ్రామాల్లో రోడ్లు, వీధులు జలమయమయ్యాయి. కొంత సమయం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పిడుగులు పడటంతో ప్రజలు భయాందోళనలు చెందారు.

హుకుంపేట: మండలంలోని ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అక్కడక్కడా పిడుగులు పడ్డాయి.

రాజవొమ్మంగి: మండల కేంద్రం రాజవొమ్మంగితో పాటు దూసరపాము తదితర పలు గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. అప్పటి వరకు అధిక ఉష్ణోగ్రతలతో తల్లడిల్లిన ప్రజానీకం ఒక్కసారిగా మేఘాలు కమ్ముకొని వర్షం కురవడంతో ఊరట చెందారు. ఉక్కబోత, అధిక వేడిమికి ఇబ్బంది పడ్డ వృద్ధులు, చిన్నారులు వాతావరణం చల్లబడటంతో సేదతీరారు. మరో వైపు వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఖరీఫ్ వరి, ఇతర పంటల సాగుకు సమాయత్తం అవుతున్నారు.


గరుడాపల్లి ప్రాంతంలో పడుతున్న వర్షం